
సాక్షి గుంటూరు

మంగళవారం । 14 । జనవరి । 2025



డ్రోన్‌తో నిఘా

నరసరావుపేట టౌన్: అనుమానిత, నిర్మానుష్యమైన ప్రదేశాలలో డ్రోన్ నిఘా ఏర్పాటు చేసినట్లు నరసరావుపేట టూ టౌన్ సీఐ హైమారావు సోమవారం తెలిపారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 564.40 అడుగుల వద్ద ఉంది. సాగర్ నుంచి కుడి కాలువకు 9,800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



గోదా రంగనాథస్వామిల కల్యాణం

రేపల్లె రూరల్: పట్టణంలోని ఉప్పూడి రహదారిలో ఉన్న రాజ్యలక్ష్మి, గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి, రంగనాథస్వామిల కల్యాణం నిర్వహించారు.

న్యూస్‌రీల్

కనుల పండువగా గోదారంగనాథ కల్యాణం



మంగళగిరి (తాడేపల్లి రూరల్): మంగళగిరి పట్టణ పరిధిలోని బాపూజీ విద్యాలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాస ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో శ్రీ గోదా రంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని గోదా రంగనాథుల అనుగ్రహాన్ని పొందారు. ఉదయం గోదా అమ్మవారికి అష్టోత్తరం, తీర్థ ప్రసాద గోష్ఠి జరిపారు. కార్యక్రమ నిర్వాహకులు తుల సీరామ్ దంపతులకు, నాగార్జుబాబు దంపతులకు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్‌స్వామి మంగళా శాసనాలు అందజేసినట్లు జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు తెలిపారు.

శాస్త్రోక్తంగా అమరేశ్వరునికి ఆరుద్రోత్సవం



అమరావతి: బాల చాముండికా సమేత అమరేశ్వరునికి సోమవారం వేకువజామున మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్ర అన్నాభిషేకాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత పంచామృతాలతో అభిషేకం నిర్వహించిన అనంతరం దాతల సహకారంతో సుమారు నాలుగు క్వింటాళ్ల బియ్యాన్ని అన్నంగా వండి స్వామికి అభిషేకించారు. ఈ సందర్భంగా ఈఓ సునీల్ కుమార్ మాట్లాడుతూ ధనుర్మాసంలో అమరేశ్వరుని జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా అన్నాభిషేకాన్ని నిర్వహించినట్లు వివరించారు. తొలుత అర్చకులు, వేద పండితులు వెంకటాద్రి నాయుని మండపంలో మహన్యాసం నిర్వహించి అనంతరం 11 అవృతాలతో ఏకదశ రుద్రాభిషేకం, వండిన నాలుగు క్వింటాళ్ల అన్నంతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా బాలచాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించిన అనంతరం అభిషేకించిన అన్నాన్ని అన్నప్రసాదంగా భక్తులకు పంపిణీ చేశారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల నియామకం

నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం సోమవారం పలువురిని పార్టీ జిల్లా బాధ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. చిలకలూరిపేటకు చెందిన కందుల శ్రీకాంత్‌ను యువజన విభాగ అధ్యక్షులుగాను, గురజాలకు చెందిన సిద్దాదపు గాంధీని బీసీ సెల్ విభాగ అధ్యక్షులుగాను, మాచర్లకు చెందిన కొమ్ము చంద్రశేఖర్‌బాబును ఎస్సీ సెల్ విభాగ అధ్యక్షులుగానూ, మాచర్లకు చెందిన రమావత్ రంగానాయక్‌ను ఎస్టీ సెల్, మాచర్లకు చెందిన మోర్తల ఉమామహేశ్వరరెడ్డిని వలంటీర్ విభాగం, సత్తెనపల్లికి చెందిన రోళ్ల మాధవిని లీగల్ సెల్, వినుకొండకు చెందిన పులిచర్ల అంజిరెడ్డిని ఐటీ వింగ్ విభాగ అధ్యక్షులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

వైఎస్సార్ సీపీ వలంటీర్ విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నరేంద్రరెడ్డి

నరసరావుపేట: మంగళగిరి నియోజకవర్గానికి చెందిన ఆనం నరేంద్రరెడ్డి వైఎస్సార్ సీపీ వలంటీర్ విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

దుర్గమ్మకు కానుకగా వెండి నివేదన పాత్ర



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు గుంటూరుకు చెందిన భక్తులు సోమవారం వెండి నివేదన పాత్రను కానుకగా సమర్పించారు. గుంటూరుకు చెందిన చాయం రెడ్డి, శ్వేత, భవితలు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులను కలిసి అమ్మవారి నివేదనకు అవసరమైన వెండి పాత్రను బహూకరించారు. సుమారు 2.860 కిలోల వెండితో తయారు చేయించిన పాత్రను అమ్మవారి మహా నివేదన సమయంలో వినియోగించాలని దాతలు కోరారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలతో సత్కరించారు.



భోగి భాగ్య మంట: గుంటూరు నగరంలో భోగి మంట వద్ద చిన్నారులు, పెద్దలు



ఉయ్యాల జంపాల: ఊయలలూగుతున్న యువతి



ఉట్టిపడిన తెలుగుదనం: సంప్రదాయ దుస్తుల్లో యువతీ యువకులు



రె'ఢీ': కోడి పందేలు వేస్తున్న నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

సంక్రాంతి జోష్!

సంక్రాంతి అనగానే తెలుగు సంస్కృతి, సంప్రదాయాలతో పాటు సందడికి పెట్టింది పేరు. పండుగ మూడు రోజులూ ఇంటింటా ఆనందం వెల్లివిరుస్తుంది. తెలుగు లోగిళ్లు ముత్యాల ముగ్గులతో సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలుకుతాయి. ఇక యువతీ, యువకులు సందడి అయితే తారస్థాయికి చేరుతుంది. గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో సోమవారం జరిగిన సంక్రాంతి సంబరాల్లో యువతీ, యువకులు సంప్రదాయ దుస్తుల్లో మెరిశారు. యువకులు పంచెకట్టుతో, యువతులు లంగా ఓణీలతో కనువిందు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ గుంటూరు

వైభవంగా శివ ముక్కోటి పర్వదినం



మంగళగిరి (తాడేపల్లి రూరల్): మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శివ ముక్కోటి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఉత్తర ద్వార దర్శన మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి జేవీ నారాయణ మాట్లాడుతూ స్వామి తెల్లవారుజాము నుంచి ఉత్తర ద్వారంలో భృంగి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారన్నారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారని తెలిపారు. దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఉత్సవానికి బచ్చు వెంకట ఉల్లక్కి, మాణిక్యమ్మ జ్ఞాపకార్థం మాజేటి లక్ష్మీ నరసింహమూర్తి, లలిత దంపతులు కై ంకర్యపరులుగా వ్యవహరించారని, అనంతరం స్వామికి గ్రామోత్సం నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు టి. మహేష్‌కుమార్‌శర్మ, దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ భోగి కోటేశ్వరరావు, డాక్టర్ వంశీకృష్ణ మాజేటి, దీప దంపతులు, ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యులు కొల్లి వెంకట బాబూరావు, అద్దంకి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అమరేశ్వరుని భోగిసేవ

అమరావతి: స్థానిక శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వరుని గుడిలో సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా సోమవారం భోగి సేవ చేశారు. అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. సోమవారం స్వామికి ఉదయాన్నే మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయంలో సంక్రాంతి పండుగ మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. భోగి రోజున స్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించారు.

జీ'పచ్చ' కాండ



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న అంబటి రాంబాబు, నంబూరు శంకరరావు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ మనోహర్‌నాయుడు తదితరులు

- మాజీ ఎమ్మెల్యే శంకరరావు గుంటూరు కార్యాలయంపై దాడి
- శాంతియుత పెదకూరపాడు నియోజకవర్గంలో టీడీపీ ఫ్యాక్షన్
- ఖండించిన వైఎస్సార్ సీపీ నేతలు
- శంకరరావును పరామర్శించిన మాజీ మంత్రి అంబటి, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, మేయర్ మనోహర్
- ఎల్లకాలం టీడీపీ అధికారంలో ఉండదని గుర్తించుకోవాలని హితవు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గుంటూరు, పల్నాడు ఎస్పీలకు వినతి
- బాధితులకు ఆస్పత్రిలో పరామర్శ

లక్ష్మీపురం(గుంటూరు): ఎల్లకాలం రాష్ట్రంలో తెలుగు దేశం పార్టీ అధికారంలో ఉంటుందని అనుకోవద్దని, మాజీ మంత్రి వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు హెచ్చరించారు. గుంటూరు జేకేసీ కళాశాల రోడ్డులోని పెదకూరపాడు మాజీ శాసన సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నేత నంబూరు శంకరరావు కార్యాలయంపై సోమవారం సాయంత్రం కంభంపాడు తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరు కర్రలు, రాడ్లతో దాడి చేశారు. ఫ్లెక్సీలను చింపేసి అడ్డు వచ్చిన వారిని కర్రలతో, రాడ్లతో విచక్షణారహితంగా కొట్టారు. సమాచారం అందుకున్న అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడు, మిర్చి యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైఎస్సార్ సీపీ నేతలు మందపాటి శేషగిరి రావు, పెదకూరపాడు నియోజకవర్గ పార్టీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావును పరామర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కార్యాలయంపై తెలుగుదేశం పార్టీ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. గతంలో వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించడానికి వెళ్ళే సమయంలోనూ వైఎస్సార్ సీపీ వారి వాహనాలపై దాడి చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు నంబూరు శంకరరావు కార్యాలయంపై దాడి చేశారని, ఎల్లకాలం టీడీపీ అధికారంలో ఉంటుందని అనుకోవద్దని హెచ్చరించారు. ఒక వైపు వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై, సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసులు బనాయిస్తూనే మరో వైపు దాడులను ప్రభుత్వం పురిగొల్పుతోందని దుయ్యబట్టారు. ఇదంతా లోకేష్ ప్రోద్బలంతోనే జరుగుతోందని విమర్శించారు, రాష్ట్రంలో లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, అదే టీడీపీ భవిష్యత్తులో శాపంగా మారుతుందని గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. సీసీ కెమెరా ఫుటేజ్ చూస్తే ఎవరు దాడి చేశారో స్పష్టంగా అర్థమవుతోందని చెప్పారు. దాడి చేయడానికి వచ్చిన వారిలో ఒక వ్యక్తి ద్విచక్ర వాహనం వదిలి పెట్టి పరారయ్యాడని, వాహనం సీజ్ చేసి ఘటనకు పాల్పడిన వారందరిపై పల్నాడు, గుంటూరు ఎస్పీలు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉద్దేశపూర్వకంగానే దాడి

పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ కంభంపాడు ప్రాంతానికి చెందిన కొందరు తెలుగుదేశం పార్టీ నాయకులు ఉద్దేశపూర్వకంగానే తన కార్యాలయంపై దాడి చేశారని విమర్శించారు. ఈ దాడిలో కొందరికి గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని వివరించారు. ఇది అత్యంత హేయమైన చర్య అని, గత ప్రభుత్వంలో అభివృద్ధి చేస్తే, కూటమి అరాచకాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. అనంతరం దాడిలో గాయపడి అరండల్‌పేట సాయి భాస్కర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దండంపుడి నరేంద్రసాయి, కట్టబోయిన జగదీష్, చైతన్యరెడ్డి, సిద్ధు, మనోజ్, శ్రీనులను నేతలు పరామర్శించారు. వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

చంద్రబాబు గొప్పలు... రాష్ట్రానికి అప్పులు

- వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు
- రాజకీయాల్లోకి అవినీతిని విపరీతంగా తీసుకువచ్చిన చంద్రబాబు
- ఈ ఏడు మాసాల్లో రూ.1.19 లక్షల కోట్ల అప్పు ఎందుకు చేశారని ప్రశ్న
- ఏదైనా తప్పు జరిగితే సారీ.. ప్రాయోశ్చిత దీక్ష చేస్తే సరిపోతుందా ?

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : రెండు రోజుల కిందట చంద్రబాబు మాట్లాడిన తీరు పరిశీలిస్తే, ఆయన ఏపీకి సీఎంగా లేరని.. దేశానికి ప్రధానిమంత్రి వలె ఆయనే అంత చేశారనేలా మాట్లాడారని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గుంటూరు సిద్ధార్థ నగర్‌లోని ఆయన నివాసంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు గొప్పలను నిజం చేసేందుకు ఆయన పచ్చ పత్రికలు, చానళ్లకు మరో పని లేదని విమర్శించారు. దురదృష్టం వల్ల చంద్రబాబు మూడు సార్లు సీఎం అయ్యారని, నాలుగోసారి గెలిచి ఐదేళ్లు సీఎంగా చేస్తున్నారని తెలిపారు. ఈ పద్నాలుగేళ్లల్లో ఆయనే నిర్మించానని చెప్పే ప్రాజెక్ట్ ఒకటైనా ఉందా ? అని ప్రశ్నించారు. ఆయన అవినీతిని రాజకీయాల్లోకి తీసుకువచ్చారని, విపరీతంగా ఎన్నికలు ఖర్చులు పెంచారని ధ్వజమెత్తారు.ఈ ఏడు నెల్లో 1.19 లక్షల కోట్ల అప్పులు ఎందుకు చేశారని ప్రశ్నించారు. రెండు రోజుల క్రితం చంద్రబాబు ఎల్‌పీ ప్రారంభోత్సవంలోనూ గొప్పలు చెప్పుకున్నారని దుయ్యబట్టారు. 2023లో ఎల్‌పీని మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతి, వైఎస్ఆర్ జిల్లాల్లో సబ్ స్టేషన్లను నిర్మించి దాని ద్వారా ఇంటింటికీ సరఫరా చేయాలని నిర్ణయించారని తెలిపారు. అప్పట్లోనే మాజీ సీఎం వైఎస్. జగన్ ప్రారంభిస్తే, చంద్రబాబు అంతా ఆయనే చేసినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. ఇక శ్రీసిటీ ప్రాజెక్ట్‌కు దివంగత మాజీ సీఎం వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి పునాది వేశారని, అప్పట్లోనే ఆయన ప్రోత్సహించారని గుర్తుచేశారు. గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్ట్‌ను కూడా జగన్ హయంలో అంకురార్పణ చేశారని అంబటి గుర్తుచేశారు. గ్రామాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. గ్రామాలన్నీ వెనక్కి వెళ్లిపోతున్నాయని సచివాలయాల సిబ్బంది, వలంటీర్ల వ్యవస్థను, ఫ్యామిలీ డాక్టర్ వంటి అనేక కార్యక్రమాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

పవన్ కల్యాణ్ అద్భుతమైన కామెడీ

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అద్భుతమైన కామెడీ చేస్తున్నారని ఆరోపించారు. ఏదైనా ప్రమాదం జరిగినా, హత్య జరిగినా, ఇతరత్రా దుర్ఘటనలు జరిగితే 'సారీ', ప్రాయోశ్చిత దీక్షలు చేపట్టడం ఆయనకు అలవాటైందని విమర్శించారు. గత ఐదేళ్లల్లో మాజీ సీఎం వైఎస్. జగన్ హయంలో గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు చేపట్టారని, వారికి శాశ్వత ఆస్తులను సృష్టించారని తెలిపారు. గ్రామాలపై ప్రజలకు ప్రేమ, మమకారం వచ్చేలా చేశారని చెప్పారు. దీనిపై చర్చకు తాను సిద్ధమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు సవాల్ విసిరారు. తిరుపతి లడ్డూలో కల్తీకి వైఎస్. జగన్ కారణమని ఆరోపించారని గుర్తు చేశారు. అయితే, తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృత్యువాతకు గురైతే టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు, జేవో వెంకన్నచౌదరి ఇతర అధికారులు బాధ్యులు కాదనడం విడ్డూరంగా ఉందని తెలిపారు. డీఎస్పీ, గోశాల డైరెక్టర్‌ను బాధ్యులుగా చేయడాన్ని తప్పు పట్టారు.

జగనన్న కాలనీల పేరు మార్పు జీవోల దహనం

భోగి మంటల్లో ఆహుతి



జీవో కాపీలను భోగి మంటల్లో దహనం చేస్తున్న శివకుమార్, పార్టీ నేతలు

తెనాలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 16వ వార్డు ఇన్‌ఛార్జి కాళిదాసు విజయ సత్యం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ముత్యంశెట్టిపాలెంలో భోగి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలతో కలిసి భోగి మంటలను వెలిగించి అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు మంజూరు చేసి ఇళ్ల నిర్మిస్తున్న వైఎస్సార్ జగనన్న కాలనీల పేరును ప్రస్తుత కూటమి ప్రభుత్వం మార్పు చేయడాన్ని నిరసించారు. సంబంధిత జీవో కాపీలను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు. అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం కుట్ర రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. జగనన్న కాలనీల పేరు మార్పు జీవోను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో పని చేసిన ముఖ్యమంత్రులు పేదలకు కొన్ని ఇళ్ల మాత్రమే కట్టించారని, అయితే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం ఊళ్లకు ఊళ్లే నిర్మించారని గుర్తుచేశారు. తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు దుర్మరణం చెందిన దుర్ఘటనకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పిన తీరుని స్వాగతిస్తున్నామని చెప్పారు.జగనన్న కాలనీల పేరు మార్పుకు తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయాన్ని కూడా పవన్ కల్యాణ్ వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దేసు శ్రీనివాసరావు, బూరెల దుర్గాప్రసాద్, కఠారి హరీష్, అత్తోట చంటి, ఎస్.రఘురామిరెడ్డి, యలవర్తి సాంబశివరావు, కొడాలి క్రాంతి, సిరి కృష్ణ, అక్కిదాసు కిరణ్, కోలా వాసు, పెదలంక వెంకటేశ్వరరావు, కాళిదాసు వెంకటేశ్వరరావు, బట్టు నాగేశ్వరరావు, రాములు, భవాని, బాజి, ఆనంద్, వెంకటేశ్వరరావు, తురకా శాంతి, దారా రమ, మరియదాస్, కన్నయ్య, అచ్యుతరావు, దారా శ్రీధర్, సురేష్, ఆదిలక్ష్మి, సునీత, సీత పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంట్లో చోరీ



పట్నంబజారు: ఇంటిలో చోరీపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట శనక్కాయల ఫ్యాక్టరీ సెంటర్‌లో నివాసం ఉండే తోకల రవి కార్పొరేషన్ పరిధిలోని సచివాలయం నంబరు– 4లో టౌన్ ప్లానింగ్ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన భార్య దేవరకొండ వెంకటశివమ్మ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తోంది. ఇద్దరూ అత్తమామలైన దేవరకొండ వెంకటరమణ, రామతులసమ్మ ఇంటిలో ఉంటున్నారు. ఈనెల 12 రాత్రి ఎప్పటిలాగే భోజనం చేసి అందరూ నిద్రించారు. వెంకటరమణకు వాష్‌రూంకు వెళ్లే అలవాటు అధికంగా ఉండటంతో కింద పోర్షన్‌లో నివాసం ఉండే ఆయన భార్య రామతులసమ్మ తలుపులు తీసి నిద్రించారు. 13వ తేదీ ఉదయం లేచి చూసేసరికి బీరువా తలుపులు తీసి ఉండటం గమనించారు. అందులోని 379 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగలు అపహరించుకుపోయారు.తోకల రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. తలుపులు తీసి ఉండటం, పక్కనే రైల్వే ట్రాక్ ఆనుకొని ఉండటంతో చోరీకి పాల్పడిన ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు. తెలిసిన వారే చేసి ఉంటారని అనుమానిస్తున్నారు.

దగ్గుబాటి ఇంట భోగి మంటలు

కారంచేడు: బాపట్ల జిల్లా కారంచేడులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఇంటి వద్ద సోమవారం కుటుంబ సభ్యులు భోగి మంటలు వేసుకొని వేడుకలు జరుపుకున్నారు. మాజీ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ఆయన కుమారుడు హితేష్ చెంచురామ్ కుటుంబ సభ్యులు, కుమార్తె నివేదిత కుటుంబ సభ్యులతో పాటు సినీ హీరో, డాక్టర్ రామానాయుడు మనుమడు దగ్గుబాటి అభిరామ్, డాక్టర్ చంద్రమౌళి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఉదయం దగ్గుబాటి కుటీరంలో భోగి మంటలు వేసి అందరూ గ్రామస్తులతో సంతోషంగా గడిపారు.

సై‘ఢర్’ నేరాలతో జాగ్రత్త !

- శుభాకాంక్షలతో శుభ్రంగా లాగేస్తారు
- పండుగ వేళ లింక్‌లతో జాగ్రత్త
- ఒక్క క్లిక్‌తో ఊడ్చేస్తారు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



పట్నంబజారు: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని అనేక మందికి గ్రీటింగ్స్ వస్తుంటాయి. ఈ క్రమంలో కొంత మంది సైబర్ నేరగాళ్లు గ్రీటింగ్ గిఫ్ట్ లింకులను పంపుతారు. ఇటీవల గుంటూరు నగరానికి చెందిన యువకుడు, మహిళకు ఇటువంటి గ్రీటింగ్స్ వచ్చాయి. లింకును ఓపెన్ చేసిన తరువాత వారి బ్యాంకు అకౌంట్లలోని నగదు ఖాళీ అయింది. నూతన సంవత్సరం అనంతరం తెలుగు వారికి వచ్చే తొలి పండుగ సంక్రాంతి. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్లు కాచుకుని కూర్చుని ఉన్నారు. సంక్రాంతి శుభాకాంక్షలు పేరిట మొబైల్ ఫోన్‌లకు ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్‌ల ద్వారా సందేశాల లింకులు పంపిస్తున్నారు. గుర్తు తెలియని నంబర్ల ద్వారా వచ్చే ఈ లింకులను ఏమాత్రం క్లిక్ చేసినా మీ అకౌంట్‌లలో నగదును క్షణాల్లో మాయం చేస్తారు. ఈ నేపథ్యంలో సంక్రాంతి, కనుమ పండుగ నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

ఏం చేస్తారంటే..?

భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు మూడు రోజుల పాటు విషెష్ చెప్పే హంగామా జరుగుతూనే ఉంటుంది. బంధువులకు, శ్రేయోభిలాషులకు, ఒక్కొక్కరూ ఒక్కో విధంగా శుభాకాంక్షలు చెప్పేందుకు ప్రణాళిక వేసుకుంటారు. కొందరు వినూత్నంగా ఆలోచిస్తూ మొబైల్‌లో వచ్చే రకరకాల చిత్రాలు, సందేశాలను పేర్ల సహా తయారు చేసుకుని పంపుతారు. అయితే, సైబర్ కేటుగాళ్లు ఇక్కడే రంగంలోకి దిగుతారు. మీకు నచ్చేవిధంగా మీ పేరుతో గ్రీటింగ్స్, శుభాకాంక్షలను తెలియజేవచ్చని, మీరు చేయాల్సిందల్లా..ఈ కింది లింకుపై క్లిక్ చేసి వివరాలు నమోదు చేస్తే చాలని అంటారు. మొబైల్‌లోని టెలిగ్రామ్, వాట్సాప్‌లకు ఏపీకే (ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్) ఫైల్స్ రూపంలో మెసేజ్‌లు పంపుతారు. పొరపాటున ఆ లింకు క్లిక్ చేస్తే అంతే సంగతులు. మన ఫోన్‌లో సమాచారమంతా వారికి పోతుంది. కాంటాక్ట్ నంబర్లు, ఫొటోలు, వీడియోలు, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలే కాక డాక్యుమెంటు ఫైల్స్ సైతం వారికి చేరిపోతాయి.

పరిశీలన అవసరం

రకరకాల గిఫ్ట్ ఓచర్లు, గ్రీటింగ్స్, ట్రావెల్, గ్యాడ్జెట్స్, ఫ్యాషన్లపై ఇచ్చే డిస్కౌంట్లును ఒకటికి రెండుసార్లు నమ్మదగినివా.. కావా ? అన్నది పరిశీలన చేసుకోవాలి. వాటి రివ్యూస్ చూస్తూ వెరిఫైడ్ అథెంటిక్ వెబ్‌సైట్లలోకి వెళ్లి ఆఫర్లను తెలుసుకునేందుకు ప్రయత్నించాలి.

క్లిక్ చేయకండి



నిత్యం సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని సూచిస్తూనే ఉన్నాం. అపరిచిత వ్యక్తులు పంపే ఏపీకే ఫైల్స్ మెసేజ్‌లపై ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయవద్దు. వ్యక్తిగత సమాచారాన్ని సైబర్ నేరగాళ్లు దుర్వినియోగం చేస్తారు. శుభాకాంక్షలు చెప్పాలనుకునేవారు ఫోన్ ద్వారా మాట కలపడం, లేదంటే సందేశాన్ని పంపడం, వీలైతే వ్యక్తిగతంగా కలుసు కోవడం మంచిది. సంక్రాంతి పండుగను ఆనందంగా గడుపుకోవాలి. సైబర్ వలలో మాత్రం పడకండి. అప్రమత్తంగా ఉండండి. జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు.

–ఎస్. సతీష్‌కుమార్, ఎస్పీ, గుంటూరు జిల్లా

జిల్లాలో నేరాల సంఖ్య ఇలా..

సంవత్సరం	కేసులు
2022	265
2023	208
2024	121 కేసులు

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఏపీకే ఫైళ్లను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయకూడదు.
- ఫోన్లోని సెట్టింగ్‌లో ఇన్‌స్టాల్ ఫ్రం అన్‌నోన్ సోర్సెస్ అనే ఆప్షన్‌ను డిజేబుల్ చేసుకోవాలి.. ఇలా చేస్తే మనకు తెలియకుండా యాప్స్ ఇన్ స్టాల్ కావు.
- మొబైల్ సెట్టింగ్‌లో ఫోన్ నంబర్లను యాక్సెస్ చేసే అనుమతి ఇవ్వరాదు.
- తెలియని ఏపీకే ఫైల్, మాల్వేర్ ఇన్‌స్టాల్ అయితే ఫోన్లో రీసెట్ ఆప్షన్ కొట్టాలి
- ఈ–మెయిల్స్, టెక్ట్స్ ఇతర సోషల్ మీడియా యాప్‌ల ద్వారా నకిలీ లింకులను గుర్తించడంతో పాటు వాటిని క్లిక్ చేయకూడదు.
- గివ్ అవేస్ పోటీల ద్వారా వినియోగదారులను ట్రాప్‌చేసి వ్యక్తిగత సమాచారాన్ని దోచేయటంతో పాటు, వివరాలను సేకరించి డార్క్ వెబ్‌కు అమ్మేస్తారు.
- మన మొబైల్/ల్యాప్టాప్(కంప్యూటర్)లలో ఉండే ఆపరేటింగ్ సిస్టమ్, యాంటీవైరస్ ప్రోగ్రాం, అధికారిక యాప్‌లను ప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి. సైబర్ నేరగాళ్లకు చిక్కకుండా సంబంధిత సంస్థలు ఎప్పటికప్పుడు తమ వ్యవస్థల్లో మార్పులు చేస్తుంటాయి.

‘కళా సముద్రం’లో సత్కారం అదృష్టం



పెనుగొండ లక్ష్మీనారాయణను సత్కరించిన రాజా, సాయిమాధవ్ తదితరులు

తెనాలి: ప్రఖ్యాత రచయిత చలం అన్నట్టు తెనాలి ఓ కళా సముద్రమని, ఇంత గొప్ప ప్రదేశంలో తనకు సత్కారం జరగడం అదృష్టమని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. తనకు జరిగిన సత్కారాలు, అందుకున్న గౌరవాలన్నీ ‘అరసం’కే చెందుతాయని వినమ్రంగా తెలిపారు. వామపక్ష భావజాలంతోనే తన కృషిని కొనసాగిస్తానని చెప్పారు. అరసం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఏర్పాటైన సభకు జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు అధ్యక్షత వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికైన జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణను సత్కరించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పెనుగొండతో తనకు 48 ఏళ్లుగా పరిచయం ఉందని చెప్పారు. ఆయన వృత్తి, ప్రవృత్తి అంతా అక్షరంతోనేనని చెప్పారు. వ్యక్తిగత సాన్నిహిత్యంలో ఆయన అందరివాడుగా పేర్కొన్నారు. ప్రముఖ సినీమాటల రచయిత, అరసం అధ్యక్షవర్గ సభ్యుడు డాక్టర్ సాయిమాధవ్ బుర్రా మాట్లాడుతూ పెనుగొండ లక్ష్మీనారాయణ ఆదర్శప్రాయుడని చెప్పారు. ఆయనకు కేంద్ర సాహిత్య పురస్కారం రావటమంటే రాష్ట్రంలోని సాహిత్యకారులు అందరినీ గౌరవించినట్టుగా భావించవచ్చని అన్నారు. ఎంత గొప్ప రచయితో పెనుగొండ అంత గొప్ప మానవతావాదిగా చెప్పారు. పెనుగొండ జీవితవిశేషాలను అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ వివరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు కనపర్తి బెన్‌హర్ స్వాగతం పలికిన సభలో అయినాల మల్లేశ్వరరావు, షేక్ జానీ బాషా, ఎం.రామలింగేశ్వరుడు, కొండముది రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఉప్పలపాడులో ట్రాక్టర్ రివర్స్ పోటీలు



పెదకాకాని: మండలంలోని ఉప్పలపాడులో గ్రామ పెద్దలు, మెగా గణేష్ యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు సోమవారం వైభవంగా జరిగాయి. ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించారు. 40 మంది పాల్గొన్నారు. సాయంత్రం చిన్నారులకు స్లో సైకిల్, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పోటీలు నిర్వహించడం ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలకు తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు దంతాల అనిల్, పల్లెంపాటి సాంబశివరావు, పసుపులేటి మహేష్, గంగిశెట్టి గోవర్ధన్, పోలిశెట్టి కిరణ్, షేక్ నూరుల్లా, మున్నంగి జగదీష్ పాల్గొన్నారు. ట్రాక్టర్ రివర్స్ పోటీల్లో మొదటి మూడు స్థానాలు నిలిచిన కల్యాణం సతీష్, పల్లెంపాటి అప్పారావు, దంతాల శ్రీనివాసరావుకు రూ.10,116, రూ.5,116, రూ.3116ను బహుమతులుగా అందజేశారు.

17,18 తేదీల్లో ఉచిత ప్లాస్టిక్ సర్జరీల పరీక్ష శిబిరం

గుంటూరు ఎడ్యుకేషన్: సికింద్రాబాద్ ఓల్డ్ మల్లేపల్లి సీతారాంబాగ్ లోని లయన్స్ క్లబ్ ఆసుపత్రిలో ఈనెల 17, 18 తేదీల్లో ఉచిత మెగా ప్లాస్టిక్ సర్జరీల పరీక్ష శిబిరాన్ని నిర్వహించనున్నట్లు రామ్ కీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.వి. రామిరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ల్యాండ్ ప్రతినిధి విద్యాభూషణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రహణ మొర్రి , గ్రహణం అంగుళీకం , కాలిన గాయాలు, చేతులకు వేళ్లు, గొంతు అతుక్కొని ఉన్నవారికి ప్లాస్టిక్ సర్జరీలు నిర్వహించడానికి ఈ శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. అంగిలి చీలిక, క్రానియో ఫేషియల్, అనోమాలిస్, పుట్టుకతో వచ్చే చేతి వైకల్యాలు, ప్రసూతి బ్రాచిలర్ ప్లేసెస్, గాయం పోస్ట్, బర్న్ పోస్ట్, ట్రామా వైకల్యాలు, వాస్కులర్ అనోమాలిస్ 12, 14 ఏళ్ల వయసు గల పిల్లలను ప్రభావితం చేసే ఇతర వైకల్యాల గురించి ఈ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 18వ తేదీలోపు స్క్రీనింగ్ పరీక్షలకు రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని వారు సూచించారు. స్క్రీనింగ్ పరీక్షల అనంతరం 20వ తేదీ నుంచి పది రోజులపాటు ఉచిత శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో ప్రముఖ వైద్యులు భవానీ ప్రసాద్, సుదర్శన్‌రెడ్డి ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 9908630301, 9848241640 లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

విశ్రాంత ఎస్పీ మాణిక్యాలరావు మృతి



మాణిక్యాలరావు (ఫైల్)

నగరంపాలెం: స్థానిక విద్యానగర్‌లో నివాసం ఉంటున్న విశ్రాంత ఎస్పీ ఉద్దంటి మాణిక్యాలరావు (75) ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 1970లో ఎస్ఐగా పోలీస్ శాఖలో చేరారు. ఎస్ఐగా తాడికొండ, పట్టాభిపురం, లాలాపేట పని చేశారు. సీఐగా తెనాలి, లాలాపేట, నెల్లూరు ఏసీబీ, కాకినాడ సివిల్ సప్లయిస్, గుంటూరు ఎస్‌బీలో సేవలందించారు. డీఎస్పీగా ఖాజీపేట, పాలకొండ, గుంటూరు ఇంటిలిజెన్స్ ఏఎస్పీగా, ఎస్పీగా కరీంనగర్‌లో విధులు నిర్వహించారు. 2007లో ఉద్యోగ విరమణ చేశారు. 2017– 2022 వరకు ఏపీ విశ్రాంత పోలీసు అధికారుల సంఘం కోశాధికారిగా పనిచేశారు. ఆయన భౌతికకాయాన్ని ఏపీ విశ్రాంత పోలీసు అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఎ.రవిచంద్ర, ఎం.రంగప్రసాదరావు, డి.సుబ్బారెడ్డి, గౌరవాధ్యక్షుడు వెల్లంకి లక్ష్మీనారాయణ, వాసుదేవ రెడ్డి, భూపాల్‌సింగ్ పూలమాలతో నివాళులర్పించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మాలకొండయ్య, గౌరవాధ్యక్షులు డాక్టర్ సి.ఆర్.నాయుడు, విశ్రాంత డీజీపీ రాజీవ్‌త్రివేది, ఎం.వి. కృష్ణారావు, జి.నారాయణస్వామి సంతాపం తెలిపారు.



యోగాసనాల్లో ‘విజయ’ దరహాసం



జాతీయ పోటీల్లో పోటీ పడుతున్న విజయలక్ష్మి



తిట్టిబాసనం భంగిమలో..



మరుదాసన్ భంగిమలో ..

గుంటూరు వెస్ట్ (క్రీడలు): '' మనిషి దేహం ఒక అద్భుతం.. దాన్ని కాపాడుకోవడం మన బాధ్యత'' అంటున్నారు గుంటూరుకు చెందిన గోలి విజయలక్ష్మి. 55 ఏళ్ల వయస్సులో ఆమె యోగాసనాలు చూపరులను విస్మయానికి గురిచేస్తాయంటే అతిశయోక్తికాదు. ఒక పక్క భర్త జి.బి.ఎస్. మల్లేశ్వరరావు ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీసుకు సహకారంగా ఉంటూ, ముగ్గురు పిల్లల బాగోగులు చూసుకుంటున్నారు. ఈ బాధ్యతల మధ్య యోగా సాధన చేస్తూ, పోటీల్లో పాల్గొంటూ, పతకాలు సాధిస్తున్నారు. ఎటువంటి ఆసనమైనా ఆమెకు దాసోహమనాల్సిందే. ఇప్పటికీ ఆమె శరీరం యోగాసనాల సమయంలో విల్లులా మారిపోతుంది. నిత్యం యోగా సాధన మాత్రం చేస్తూనే ఉంటారు. పాండిచ్చేరిలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ టూరిజం ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు జరిగిన 30వ ఇంటర్నేషనల్ యోగా ఫెస్టివల్‌లో విజయలక్ష్మి కాంస్యం గెలుపొందారు.

భర్త ప్రోత్సాహం

గతంలో విజయలక్ష్మి సమ్మర్, స్పెషల్ యోగా క్లాస్‌లు నిర్వహించేటప్పుడు అప్పుడప్పుడు వెళ్లేవారు. అయితే, భర్త మల్లికార్జునరావు ప్రోత్సాహంతో 2018లో యోగా శిక్షణలో పూర్తిస్థాయిలో పాల్గొని, దానిలో పట్టు సాధించారు. ఆ తర్వాత 20 వరకు రాష్ట్ర పోటీల్లో పాల్గొని, 15 వరకు ప్రథమ స్థానాల్లో నిలిచారు. ఆ తర్వాత ఎనిమిది నేషనల్స్‌లో పాల్గొన్నారు. గత నెల కర్నాటకలోని టుంకూరులో జరిగిన ఎస్‌వైఎస్ఎఫ్ (యోగాసనా భారత్) పోటీల్లో బంగారు పతకం సాధించారు. దాదాపు ఆరేళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు ఈ పతకం దక్కడం గమనార్హం.



పాండిచ్చేరిలో జరిగిన అంతర్జాతీయ యోగాలో కాంస్య పతకం స్వీకరిస్తున్న విజయలక్ష్మి

ఆరోగ్యాన్ని కాపాడుకోవడం బాధ్యత

ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. దీనికి పెద్దగా చేయాల్సిందేమీ లేదు. ఇంట్లో వండినవి తింటూ, వాకింగ్, యోగా, సానుకూల దృక్పథం ఉంటే సరిపోతుంది. ఇంత అద్భుతమైన జీవితాన్ని చాలా మంది రోగాలతో గడిపేయడం బాధగా ఉంది. శరీరం అన్న తర్వాత ఇబ్బందులు ఎదురవుతాయి. వాటిని క్రమపద్ధతిలో ఎదుర్కోవాలి. యోగాలో అనేక శారీరక, మానసిక రుగ్మతలకు పరిష్కారం లభిస్తుంది. గతంలో నాకు థైరాయిడ్ ఉండేది. యోగ సాధన తర్వాత అది ఎటుపోయిందో ! ప్రతి రోజూ యోగా సాధన చేస్తాను. పోటీలకు వెళుతుంటాను. నా భర్త సహకారం గొప్పది.

–గోలి విజయలక్ష్మి, యోగా సాధకురాలు

రెండు బైక్‌లు ఢీ: విద్యార్థి మృతి

వేటపాలెం: ఎదురెదురుగా రెండు మోటార్ బైక్‌లు ఢీకొట్టుకోవడంతో ఓ విద్యార్థి మృతి చెందాడు. ఈఘటన మండలంలోని కఠారివారిపాలెం రోడ్డులో సోమవారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ ఎం వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. చినగంజాం మండలం మోటుపల్లి వద్ద నీరిక్షణగిరికి చెందిన పొన్నపూడి మనోహర్ జోష్ (15), తన పెద్దమ్మ గ్రామమైన కఠారివారిపాలేనికి సంక్రాంతి పండుగకు వచ్చాడు. పెద్దమ్మ కొడుకు కొండూరి గోపయ్య ఇద్దరూ కలసి బైక్‌పై వేటపాలెం వచ్చారు. పని పూర్తిచేసుకొని తిరిగి కఠారివారిపాలెం వెళ్తున్నారు. అదే సమయంలో కఠారివారిపాలెం నుంచి వేటపాలెం వస్తున్న బైక్‌తో ఎదురెదురుగా ఢీకొట్టుకున్నారు. దీంతో ఇద్దరూ రోడ్డుపై పడటంతో తీవ్రగాయాలయ్యాయి. వెనుక కూర్చొన్న మనోహర్ జోష్‌కి తీవ్ర గాయాలు కాగా చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మనోహర్‌జోష్ మృతి చెందాడు. కొండూరి గోపయ్య ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



వైభవంగా మహా రుద్రాభిషేకం



పెదకాకాని: అమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పెదకాకాని మండలం తక్కెళ్లపాడులో సోమవారం మహారుద్రాభిషేకం, మహాభస్మాభిషేకాలు వైభవంగా జరిగాయి. స్థానిక గంగా భ్రమరాంబ సమేత చంద్రశేఖరస్వామి ఆరుద్ర మహోత్సవాల సందర్భంగా ఐదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించారు. మహారుద్రాభిషేకం, మహాభస్మాభిషేకంలో తక్కెళ్లపాడుతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

